# తిరుమలలో భక్తిశ్రద్ధలతో రథసప్తమి



హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు వాహనసేవతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరగా ముస్తాబు చేశారు. రకరకాల పుష్పాలతో ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. వేడుకల్లో భాగంగా ఉదయం 5.30 గంటలకు శ్రీవారు సూర్యప్రభ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఈ వాహనసేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. స్వామివారి వాహన సేవలు రాత్రి వరకూ కొనసాగనున్నాయి. ఉదయం 11 గంటలకు చిన్న శేషవాహనం, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత గరుడ వాహనం, ఆ తర్వాత హనుమంత వాహనంపై స్వామివారిని ఊరేగించారు. సాయంత్రం 4 గంటలకు శ్రీవారికి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహన సేవలు నిర్వహించారు.

# హెచ్‌ఎండీఏ భూముల వేలంపై ఏసీబీ నివేదిక

## వేలంపాట నిలిపివేతకు ప్రభుత్వ నిర్ణయం?

**ఇప్పటివరకు వేలం వేసిన భూములపై విచారణ**

- నాడు హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా శివబాలకృష్ణ
- వేలంపై రియల్టర్లకు ముందే సమాచారం
- వారికే భూములు దక్కేలా అధికారుల చర్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్‌ను లోతుగా విచారిస్తున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరికొన్ని కొత్త విషయాలను వెలుగులోకి తెచ్చారు. హెచ్‌ఎండీఏ భూముల వేలంలో ఆయన ఎన్నో అక్రమాలకు పాల్పడినట్టు తేల్చారు. ఈ వేలానికి ముందే సంబంధిత సమచారాన్ని పలువురు రియల్టర్లకు అందజేశారని, తద్వారా వేలంలో వారికే భూములు దక్కేలా హెచ్‌ఎండీఏ అధికారులు చర్యలు చేపట్టారని, భూముల ధరలను నిర్ణయించడంలోనూ వారే కీలకపాత్ర పోషించారని గుర్తించారు. ఆ అవకతవకలపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో ఈ వేలం పాటను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించడంతోపాటు ఇప్పటివరకు జరిగిన భూముల వేలంపై విచారణ చేపట్టినట్టు తెలిసింది. హెచ్‌ఎండీఏ భూముల వేలంలో అక్రమాలకు పాల్పడటం ద్వారా వచ్చిన సొమ్మును శివబాలకృష్ణ ఎప్పటికప్పుడు తన కుటుంబసభ్యులు, బంధువులు, పనిమనుషుల పేరిట బినామీ ఆస్తులుగా మార్చినట్టు సమాచారం. దీంతో శివబాలకృష్ణ ఆస్తులకు సంబంధించిన లావాదేవీలను నిలిపివేయాలని ఏసీబీ ఇప్పటికే కలెక్టర్‌కు లేఖ రాసింది. మరోవైపు శివబాలకృష్ణ అక్రమాలకు సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐఏఎస్ అధికారిపై చర్యలు చేపట్టేందుకు ఏసీబీ సిద్ధమవుతున్నది.

# ఏపీలో 'రాజధాని ఫైల్స్' విడుదలకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాజధాని ఫైల్స్ సినిమాను ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేసుకునేందుకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సినిమాలో అభ్యంతరకర సన్నివేశాలను తొలగించామని చెప్పిన సెన్సార్ బోర్డు వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఈ సినిమా విడుదలను ఆపాలంటూ వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి ఫిర్యాదుపై విచారణ జరిపిన కోర్టు స్టే విధించింది. శుక్రవారం మరోసారి విచారణ జరుగగా, స్టేను ఎతివేస్తూ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దీంతో ఏపీలో రాజధాని ఫైల్స్ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.





